ముద్దు

౧

"అనగనగా వకరాజు. ఆరాజుకు ఏడుగురు——"

"అవును, అలాగే! నాకు తెలుసులెండి ఆకథ, మీరు చెప్పక్కరలేదు!" అన్నది నాభార్య.

రాత్రి భోజనముచేసి, ఆఫీనుకాకితాలు చూచుకొంటూ కుర్చీలో కూర్చున్నాను. నాభార్య కుర్చీ వెనక నిలుచుని తమలపాకులు చుట్టిస్తూ కథ చెప్పమన్నది. జరూరుకాకితాలు చూచుకొంటూ ఉండడము మూలాన మంచి కథ తోచకపోతే అమ్మమ్మకథ ఒకటి మొదలుపెట్టినాను. మాఅమ్మమ్మ బతికి ఉన్న కాలములో నన్ను కూర్చోబెట్టి ఎన్నో కథలు చెప్పింది. చాలాకథలు మరిచిపోయినాను. ఇప్పుడంతా కలెక్టరాఫీసు కథతప్ప మరేకథా లేదు. ఇలాంటివిషయములో నన్ను కథ చెప్పమంటే ఏలాగు చెప్పడము? అయితే నాభార్య ఎప్పుడేది కోరితే అప్పుడది చెల్లించడము నామతము. నాభార్యకు చిన్నతనము; ఆకారణముచేత వేళాపాళా లేకుండా ఆవిడ కథ చెప్పమనీ, ఇది చెప్పమనీ అది చెప్పమనీ ఉంటుంది యక్షప్రశ్నలు

వేస్తూ ఉంటుంది. ఆమెమాట కొట్టివేయ లేక ఏదో కుక్క కథా, నక్క కథా చెప్పి తృప్తి చేసేవాడను. ఏకథ చెప్పినా ఏసమాధానము చెప్పినా విని ఆనందించడము ఆమె కలవాటు. ఆవిడ ఒకనాడు నాదగ్గిరికి వచ్చి, 'నే నొక్కమాటచెప్పుతాను, కోపపడరు గదా!' అన్నది.

'ఊహు' అన్నాను.

'అయితే, మరి రైలుబండి పరిగెత్తుతుంది గదా, దానికి గుర్రాలు కడతారా, ఎద్దులు కడతారా లాగ డానికి? చెప్పండి.'

'గుర్రాలనూ కట్టరు, ఏనుగలనూ కట్టరు. ఆవిరిశక్తి వల్ల నడుస్తుంది అది——'

'మీరు చెప్పక్కర లేదు, నేనే చెప్పగల. దానికి ముందర సింహాలనూ పెద్దపులులనూ కట్టుతారు. అవి లాగుతవి.'

'అయితే అవి లాగుతున్నట్టు కనపడ వేమి?

'ఇంజరములో వుంటే అవి ఎలా అవుపడతవి!'

వట్టి వెర్రిపిల్ల! ఇక ప్రస్తుతాంశము. నేను చెప్పబోయే కథ నాభార్య గ్రహించి మీరు చెప్పక్కర లేదన్నది. అయినా కాదని బొంకి తప్పించుకొనవలె ననీ, కొత్త

కథ చెప్పవలె ననీ సంకల్పించుకొని ముందున్న కాకితాలు దూరముగా పెట్టి ఆలోచిస్తూ అన్నాను: 'నేను చెప్పబోయేకథ నీకు తెలుసు నన్నావు గదా, ఏమిటో చెప్పు!'

'చెప్పనా! అనగా అనగా నకరాజు, ఆ రాజుకు ఏడుగురు కొడుకులు, ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళారు—'

'ఆగు, ఆగు! అదికాదు నేను చెప్పబోయేది.'

'అదే, నాకు తెలుసు. ఇంకొకటి కాదు. అదే అదే!'

'కాదంటూ వుంటే!'

'మీరు చెప్పేకథ అదే. కావలిస్తే పందెం వెయ్యండి!'

ఇదివరలో ఇలాంటిపందెములు వేసుకొనడము మా కలవాటే. రూపాయలపందెము ఒక మాటూ, చీరెలు కొనేపందెము ఇంకోమాటూ, నగ చేయించే పందెము మరోమాటూ, అయినవి. ఈమాటు కొత్త రకపు పందెము వేయవలె ననుకొని, 'సరే, పందెం ఏమిటి చెప్పు' అన్నాను.

'మీరే చెప్పండి. మీరు చెప్పే దేదో అదే పందెం. నేనూ ఒప్పుకుంటాను.'

'అలా గయితే విను. ఇదివరకల్లాబట్టలూ, నగలూ పందెం వేసి నాదగ్గర పుచ్చుకొనేదానవు. ఇప్పుడు నీవు నా కియ్యవలె, నేను గెలిస్తే ఏ మడిగితే అది నీవు నా కియ్యవలె. మరి తిరగకూడదు!'

'సరే, చెప్పండి, చెప్పండి కథ.'

తప్పని సరి గదా అని కథ అల్లడము ప్రారంభించాను. నేను పడ్డపాట్లు ఆపరమాత్ముడికే ఎరుక! కథ చదవడమైనా, చెప్పించుకొనడమైనా మహాచులకనగా ఉండేది. కల్పించి కొత్తకథ చెప్పడమంటే ఎంతకష్టమో ఇప్పుడు నాకు అనుభవంలోకి వచ్చింది. తమల పాకులు నములుతూ, సట్లు పసుతూ కథ ప్రారంభించాను. నాభార్య ఊఁకొట్టుతున్నది.

౨

"అనగనగా ఒకరాజు. ఆరాజుకు ఏడుగురు భార్యలు. అందులో చిన్న భార్య అంటే ఆయనకు చాలా యిష్టము. అందుచేత ఎప్పుడూ చిన్న భార్య అంతఃపురములోనే వుండేవాడు రాజు. అన్నట్టు చెప్పడము మరచి పోయినాను! ఆరాజు ఏడుగురు భార్యలకూ ఏడు మేడలు కట్టించినాడు. చిన్న భార్యకు ఒంటిస్తం

భము మేడ. మేడచుట్టూ తోట. తోటలో పక్షులు లేళ్ళూ, కుందేళ్ళూ ఎప్పుడూ వుండేవి."

"రాజుగారు మేడ కట్టించారని తిరగడానికి వచ్చినవి కాబోలు తోటలోకి లేళ్ళూ, కుందేళ్ళూ!" అన్నది నాభార్య ఆక్షేపణగా.

"కాదు. రాజుగారు వాటిని పెంచుతున్నారు. అవి యెప్పుడూ తోటలోనే తిరుగుతూ వుండేవి. తోటలో పెద్దసరస్సు తవ్వించినాడు, ఎంతో చక్కటిది! దానికి నాలుగువైపులా రాతిమెట్లు కట్టి, వాటిమీద పూలమొక్కలకుండ్లు పెట్టి అలంకరించినారు. నీటినిండా తామర పూలు; ఎర్రతామరలు, తెల్లతామరలు, పచ్చతామరలు."

"అ దేమిటి? పచ్చతామర లుంటవా?"

"రాజుగారు కాశ్మీరదేశమునుంచి వాటిని తెప్పించి, వేశారట. ఆ పచ్చతామరలు బంగారములాగు వుంటవి."

"అబ్బా! ఇవన్నీ ఎందుకు? కథ చెప్పెదరు!"

"ఇది కథ కాదూ? మరి కొనకూ విను. ఆవొంటిస్తంభము మేడలో చిన్న రాణి నౌకర్లతోటీ, చాకర్లతోటీ, దాసీలతోటీ, హాయిగా కాలము గడుపుతూ వున్నది. చెలికత్తెలతో జలక్రీడలూ పక్షులతో మా

ట్లాడడమూ, రెండుపూటలా పూలు కోయ్యడమూ దండలు గుచ్చడమూ, లేళ్ళతో ఆడుకోనడమూ. ఈవిధముగా కాలము గడుపుతూవున్నది. ఒకనాడు వక బ్రాహ్మడు చిన్నరాణీ మేడలోకి వచ్చినాడు. ఆయన పెద్ద జ్యోతిష్కుడుట. తనమీద రాజుగారికి ఎప్పుడు దయ కలుగుతుందో చెప్పమని చిన్నరాణి దాసీద్వారా బ్రాహ్మడికి కబురు పంపింది."

"అదేమిటి? రాజుగారికి చిన్న భార్యమీద మమకారమని చెప్పినారు కాదూ? అందుచేతనే ఆవిడ అంతఃపురములో—"

"అవును, అన్నట్టు మరిచిపోయినాను. రాజుగారికి చిన్నభార్య అంటే చాలా ఆపేక్ష!"

"ఆ, అమ్మా, చూశారా! కథ చెప్పమంటే ఏమిటో కల్పించి చెపుతున్నారు. ఇది నిజంకథ కాదు."

"చివరదాకా విను. ఇది నిజంకథే. నిద్రమత్తున ఒకటి చెప్పబోయి ఇంకొకటి చెప్పినాను. ఏదీ, ఆఁ! చిన్నభార్యమీద ఆపేక్షమూలానే రాజావిడకు మంచి మేడ కట్టించినాడు. ఆమేడలో గోడలమీద చెక్కినారుట రకరకాల బొమ్మలు. వేటితో అనుకున్నావు, మాణిక్యాలతో! మిగిలిన భార్యలు ఆరుగురికీ చిన్న భార్యమీద కోపము వచ్చింది. అందులో పట్టపురాణీ

కి మరీకోపము వచ్చింది—అసూయకూడా. ఓరవలేని తన మనేది అంటువ్యాధి వంటిది; చెవిలోనుంచి లోపలికి ప్రవేశిస్తుంది. ఊపురుగు చెలికత్తె మాటలద్వారా మనస్సులో ప్రవేశించి తొలవడం ప్రారంభిస్తుంది. అక్కడినుంచి పుట్టుకువస్తవి కొత్తకొత్త జబ్బులు! కోపాలూ, శోకాలూ!"

"ఏమిటి, కథ మానివేసి జబ్బులసంగతి చెప్తారు! చెప్పేటందుకు కథ లేకపోతే వర్ణనలు ఎక్కువవుతవి. నాకు నిద్ర వస్తున్నది. చప్పున చెప్పండి కథ. మీా రెప్పుడూ ఇంతే!"

"అవును, పొరపాటు పడ్డాను. పట్టపురాణికి ముఖ్యంగా క్రోధం పుట్టింది. ఆమె యెలాగయినా కసి తీర్చుకోవలె నని ఆలోచించింది. ఎలాగు తీర్చుకోవడము? —"

తరవాత నాకు కథ నడిపింది కాదు; కసి ఎలా తీర్చుకొనేలాగు చేస్తే బాగుంటుందో ఆలోచించ కాదు. అప్పుడు కొంచెము గడుసుతనం చేసి నాభార్యకు ప్రశ్న వేశాను, "కసి ఎలా తీర్చుకొంటుందో నీవు చెప్పు!"

"చెప్పనా, చెప్పనా! చంపించవలెనని ప్రయత్నం చేసింది" అన్నది.

“కాదు, మళ్ళీ ఆలోచించి చెప్పు.”

“ఏమిటి, చెప్తా! మరి, రాజుగారిని అక్కడికి వెళ్ళకుండా చెయ్యవలెను అనుకొన్నది. అవునా?”

“కాదు. వెళ్ళకుండా ఎలా చేస్తుంది?”

“తనదగ్గిరే ఆడుతూ పాడుతూ కాలము వెళ్ళబుచ్చేలాగు చేస్తే సరి.”

“రాజు అసలావిడదగ్గిరికి రానడమే లేదే.”

“అవును, అన్నట్టు! కసి తీర్చుకోవడము ఎలాగు?”

“చెప్పుకోవలె మరి.”

“ఆఁ, ఈమాటు తెలిసింది. పారిజాతాపహారణములో కథ చెప్పినారుగాదూ; సత్యభామలాగున మాసినచీరె కట్టుకొని తలకట్టు కట్టుకొని, పండుకొంటే సరి. రాజువచ్చి విసనకర్రతో విసురుతూ అలకతీరుస్తాడు. అప్పుడు చిన్న భార్యకు బుద్ధి చెప్పిన ట్టవుతుంది.”

“మహాబాగా చెప్పావు! రాజు కృష్ణమూర్తిలాగున వెర్రిగొల్లవాడు అనుకొన్నావా యేమిటి—విసనకర్ర పుచ్చుకొని విసురుతూ, ఎడమకాలి తాపులు తిని అలక తీర్చడానికి?”

“నాకు తెలియదు. మీరు చెపుదురూ!”

నా భార్య చెప్పిందల్లా కొట్టివేశాను. ఇప్పుడు నేను మాత్రము కథ చెప్పడము ఎలాగు? కొంచెం మాలో చించి ఎలాగో కథ సాగించాను. “పెద్దభార్య కసి తీర్చుకోవడానికి ఆలోచించింది. తనవక్కర్తె వల్లా కా దనుకుంది; అనుకుని చెలికత్తెను పిలిచి ఆలోచన అడిగింది. కుట్ర చెయ్యడానికి ఇద్దరుమనుష్యు లుండవలె. ఒకడికి ధీమా రెండోవాడు. ఒకడు చెప్పినదానికి రెండోవాడు తల వూపితేనే గాని మొదటివాడికి హుషారీ పుట్టదు. ఇద్దరూ వకమోస్తరు మనుష్యులు కావలె. దొంగకు దొంగవాడే స్నేహితుడు. దుర్మార్గుడికి మంచివాడితో స్నేహము పొసగదు, పైగా విషమిస్తుంది......”

“ఏమిటి వేదాంతం, కథ చెప్పక! రాణీ కసి తీర్చుకోవడము సంగతి మాని వేసి వేదాంతంలోకి దిగినారు! మీకు కథ నడపడం లేదు!” అన్నది నాభార్య.

“అవును, మరి వూరికే అన్నారూ ఆడవాళ్ళకు చలచిత్తమని! రవ్వంతసేపు ఓపిక పట్టలేవు కదా! కథో కథో అంటావు! ఈచెప్పేది కథ కాదూ!”

“ఔను, ఆడవాళ్ళకి చలచిత్తమే—మొగవాళ్ళ మోస్తరే. మీరు వెళ్ళే దారిని వెళ్ళనియ్యకపోతే తిరగబడతారు. నా కెందుకు లెండి—మీయిష్టం వచ్చి

నట్టు కథ చెప్పుకోండి! నాకు నిద్ర వస్తుంది. నేను వెళ్ళి పడుకుంటాను.”

“వెళ్ళితే ఎరగవ్వూ! పందెం వేశా వన్నమాట మరిచిపోయినావు కాబోలు!”

“నిజంకథ అయితే పందెం కాని కల్పనాకథకు పందెం ఏమిటి?”

“నిజంకథో, కల్పనాకథో నీకెలా తెలిసింది?”

“కల్పనాకథ కాబట్టే పాపము! మిమ్మలిని ఎక్కడి కక్కడికి చిక్కులు పెట్టుతున్నది! ఇదివర కెన్నికథలో చెప్పినారు. ఎప్పుడైనా ఇలాటికథ చెప్పినారా?”

“ఆకథ లన్నింటికంటే మంచి దిది. అందుచేత కొంచెం విపులంగా చెప్పతున్నాను.”

“అదుగో, కబుర్లలోకి దింపుతారు గాని కథ చెప్పరు. నే ఎరగనా యేమిటి!”

“సరే చెపుతా విను. కథ ఎందాకా అయింది?”

“అనడమే కాని అన్నమాట జ్ఞాపకం వుంచుకోవడం లేదు. ఇప్పుడే కాదూ ఆడవాళ్ళకి చలచిత్తం అని దెప్పిపొడిచారు!”

“సరేలే! కథ యెక్కడ వదిలి పెట్టాను?”

“పెద్దరాణీ దాసీదానితో......”

"అవును, అన్నట్టు పెద్దరాణీ, దాసీదీ కలిసి కుట్ర పన్నారు. ఇద్దరూ పురుషవేషం వేసుకొని కోటలో నుంచి నిమ్మళంగా బయిటికి వెళ్లుదాము అనుకొన్నారు."

"వెళ్ళి?"

"తొందర పడకు! చివరదాకా విను—వెళ్ళి, కోట వెలపల బట్టలు మార్చివేసి, కాపుస్త్రీలలాగు వేషం వేసుకొని రాజుగారు తీర్పులు చెప్పుతూ వుండే సమయానికి సభలోకి వెళ్ళదలుచుకున్నారు."

"అయితే, చిన్నరాణీమీద కసి తీర్చుకోవడం ఎలాగు?"

"సి కెక్కడా లేనితొందర!"

"రాణివాసంలో బతికింది గదా, అందులో పట్టపు రాణీగదా, సిగ్గూ భిడీయమూ విడిచి నిండుసభలోకి ఎలా వెళ్ళవలె అనుకున్నది!"

గట్టిచిక్కే! సంగతి మరిచిపోయి పూర్వాపరసందర్భము చూసుకోకుండా ఏదో అన్నాను. నాభార్య వేసిన సవాలుకు మళ్ళీ ఆలోచించి సమర్థించుకొనడానికి ఇలా చెప్పినాను: "ఎలా వెళ్ళా లనుకొన్నదా, చక్కనిచుక్కలాగ."

"అది కాదండీ. వెళ్లితే నలుగురూ ఏమయినా అనుకుంటా రని వుండదూ?"

"పట్టు వచ్చిందంటే ఆడవాళ్ళు ఎంతపనైనా చేస్తారు. అయినా నలుగురికీ తెలిసేలాగు వెళ్ళుతారా యేమిటి! మారువేషం వేసుకొని......"

"రాజు ఆనవాలు పట్టలేదు కామోసు?"

"కాపుదానిలాగు వేషం వేసుకుంటే రాజు ఎలా గుర్తు పడతాడు?"

"సరే, కానియ్యండి."

"అడుగడుగుకూ ఇలా సవాళ్లు వేస్తుంటే కథయేమి సాగుతుంది? చెప్పిందేమో మరిచిపోతాను, చెప్పబోయేది తోణకదు."

"తెలియకపోతే అడగగూడదూ?"

"అడగవచ్చు. మరి వేళాపాళా లేదూ?"

"సరే, ఎప్పుడూ ఇలా సాధిస్తూ వుంటారు! కథ కానియ్యండి."

"ఆలాగు వాళ్ళిద్దరూ రాజుగారి సభలోకి వెళ్ళాలనుకొన్నారు. అంతే కాకుండా, చిన్నరాణీకి జాబు వ్రాతామనుకొన్నారు, ఎవరిపేరైనా పెట్టి తెలియకుండా. ఆఁ, ఎవరిపేరు...జ్ఞాపకం వచ్చింది. దేవుడు వెంకటేశ్వర్లపేరు బెట్టి అలా చేతామనుకొన్నారు."

"ఉత్తరం ఏమని?"

"అంతా యిప్పుడే చెప్పేస్తే ఇంకా కథేమిటి?"

"చెప్పకపోతే దాచుకోండి!"

"అదేమిటి మళ్ళీ ఆవికారం!"

"వికారమే మరి. ఎప్పుడేమి అడిగినా అలాగే. చెప్పమంటే చెప్పరు."

"చెప్పుతున్నాను కాదూ! విను. పట్టపురాణీదాసీ ఒకనాడు చిన్నరాణీ దాసీయింటికి వెళ్ళింది. చిన్నరాణీ దాసీదాన్ని చూచి, 'పెద్దరాణీగారి దాసీగారు కాబోలు. మాయింటికి వచ్చారేమి?' అన్నది.

'పేరు పట్టపురాణీదాసీ అనడమే కాని ఘనమా, మెప్పా! చిన్నరాణీగారు సుఖంగా వున్నారా?'

'ఆవిడకు సుఖం కాకేమి! రాజుగారు వెనకవెన్నల తిరుగుతున్నారని ఆవిడకు ఎక్కువా లేని గీర్వాణం, గర్వం!'

'ఏమి, అలా అంటున్నావు!'

'అననా యేమిటి? అడ్డమైనచాకిరీ చేయించుకోవడమూ, ఎంత చేసినా మెప్పు లేకపోవడమూ! పెద్దరాణీగారిదగ్గిర వున్నప్పుడు ఎంతో సుఖపడ్డా నమ్మా!'

'పెద్దరాణీగారు నీదగ్గిరికి నన్ను పంపించారు. నీను కానులపేరు బహుమతీ యిమ్మన్నారు!'

'నిజంగానా?'

'నిజంగానే. ఆవిడకు నీవల్ల వకకార్యం కావలసి వుందట.'

'ఏదీ అక్కా! ఎంతబాగుంది! ఈకానులవేరేనా నా కివ్వమంట?'

'ఇదే, నీవు పుచ్చుకోవలె. ఇదిగోచూడు, ఈవు త్తరం చిన్నరాణీగారి పరుపుమీద వుంచాలి. దీన్ని బట్టి వ్యవహారం నడిపించాలి.'

'అ దెంతసేపు!'

"తర్వాత పెద్దరాణీ, ఆవిడదాసీ కలిసి, అదివర కనుకొన్నట్టు సభలోకి వెళ్ళినారు; వెళ్ళి రాజుగారితో మొరబెట్టుకొన్నారు."

"ఇద్దరూ వకమాటే మొరబెట్టు కొన్నారా!"

"లేదు. పెద్దరాణీ మొరబెట్టుకుంది. దాసీ సాక్ష్యం పలికింది."

"ఏమని మొర!"

"భర్త తన్నస్సలు ఒల్లడం లేదనినీన్ని, ఎవర్తెనో వల చినాడనీ. ఎందుకు ఒల్లడం లేదని రాజుగారు అడిగి నారు. తన తప్పు ఏమీ లేదనీ, ఇంకో చిన్నపెళ్ళాము దొరకడమే కారణ మనీ ఆమె చెప్పింది. అప్పుడు రాజుగారు అన్నారు: ఇద్దరు భార్యలను పెండ్లాడడ

ముబట్టి ఇద్దరినీ ఏకవిధంగానే చూడవలసి వుంటుందనీ, పెద్దదాన్ని ఏలకపోవడం తప్పనీ, వాడిని దండిస్తాననీ. ‘బంగారానికే తుప్పు పట్టితే ఇనుముగతి ఏమి కావలసింది?’ అని వాళ్లు అక్కడినుంచి వెళ్ళిపోయినారు. రాజుకు అప్పుడు కొంచెం అనుమానం కలిగింది; కాపుది తన పెద్దభార్యేమే అనుకొన్నాడు.”

“నే చెప్పలేదూ, ఆనవాలు పడతాడని?”

“చెప్పావు. అయితే ఎక్కడ చెప్పవలసింది అక్కడే చెప్పవలె, ముందు చెప్పకూడదు.—ఆఁ, అనుమానం పుట్టి తనపెద్దభార్యను తిన్నగా చూడక పోవడం దోష మని రాజుకు తోచింది. కాపువాడిని తాను దండిస్తా నన్నట్లే తన్ను దైవం దండిస్తాడేమో అనుకొన్నాడు రాజు.”

“అదివరకు పుట్టిందికాదు కాబోలు ఈబుద్ధి!”

“పుట్టివుంటే ఏబాధా లేకపోను. పుట్టకపోబట్టే నేను కథ చెప్పడమూ,నీవు వినడమూ తటస్థించింది!- తరువాత చిన్నరాణీ పక్కమీద పడివున్న వుత్తరం చూసి, విప్పి చదివింది.

“నాభక్తురాలైన చిన్న రాణీని, తిరుపతివెంకటేశ్వర్లు దీవించి వ్రాసేది యేమనగా :

"రాజు నీమూలాన పెద్దరాణీని నిర్లక్ష్యము చేస్తూ వున్నాడు. ఆవిడ ఉసురుకొట్టి నీవు చెడిపోతావు. కాబట్టి నీవు రాజును పురికొల్పి, ఏడుగురు రాణీలను ఆయన ఒక్క మోస్తరుగా చూసే లాగున చేయవలసి వుంటుంది. భర్తురాలవు కావడముచేత నీకు స్వయముగా వ్రాస్తున్నాను.

తిరుపతి వెంకటేశ్వర్లముద్ర."

"ఈవుత్తరము చదివేటప్పటికి చిన్నరాణీ పై ప్రాణాలు పైన పోయినవి. అప్పుడు దాసీదాన్ని పిలిచింది రాణీ. వింటున్నావూ? కునికిపాట్లు పడుతున్నావు, చూశావూ!"

"కునికిపాట్లూ లేవు గినికిపాట్లూ లేవు. మూబాగా పన్నారు కుట్ర!" అన్నది నాభార్య.

"ఆడవాళ్ళు గట్టివాళ్లు కారూ, మరి?"

"కానిస్తూరూ కథ. ఎప్పుడూ ఆడ వాళ్ళను దెప్పడమే మీపని."

"చిన్నరాణీ దాసీదానికి కబురుపంపి ఉత్తరం పక్క మీదికి ఎలా వచ్చిందని అడిగింది. అది యిలా చెప్పింది. తాను పొద్దునే లేచి గదివైపు వెళ్ళిందట. ఎవరో గదిలోకి వెళ్ళారట. పచ్చనిబట్ట, చేతులో పిల్లంగోవి, నీలమేఘం లాటి శరీరమూ చూసి ఎవరు చెప్తా లోప

లికి వెళ్ళారని తాను గదిలోకి వెళ్ళితే ఎవరూ కనబడలేదట. అప్పుడు చిన్నరాణీకి భయం వేసింది. నిజంగా వెంకటేశ్వర్లేవచ్చి ఉత్తరం అక్కడే పెట్టి వెళ్ళినాడని ఆమె అనుకోవడములో వింతేమి? సరే. రాజు బుద్ధి మరల్చాలి అనుకున్నది."

"మరిల్చిందా?"

"ఆడవాళ్లు తలుచుకొంటే ఏ పనికాదు?"

"మళ్ళీ ఆడవాళ్ళమాటే!"

"అయినా మరల్చడానికే ముంది, ఆయనబుద్ధి మారే వున్నది."

"అంతేనా కథ?"

"అంతే. ఆరోజు మొదలుకొని రాజు తన భార్యలనందరినీ వక్కమోస్తరుగా చూచుకొంటూ సుఖంగా వున్నాడు. కథ కంచెకు వెళ్ళింది, మనము ఇంటికి వచ్చాము."

"అమ్మయ్యా, నిద్దర వస్తున్నది, వెళ్ళి పడుకోవలె."

"పందెం గెలుచుకొన్నాను. నే నడిగింది యిచ్చి మరీ కదులు."

"ఎలా గెల్చారేమిటి?"

"నీ వనుకొన్న కథా నే చెప్పింది!"

"కాకపోతే మాత్రం, నిజంకథా యేమిటి!"

"నిజం కథ కాదూ, పుస్తకాల్లో కథలలాగు లేదూ?"

"ఉంది లెండి. అయితే దీన్ని మీరు కల్పించారు. నే నోడినట్టు ఒప్పుకోను."

"ఒప్పుకోకపోతే సరా! నీ వనుకొన్న కథ కాదు, నే చెప్పింది. అంతే నాకు కావలిసింది."

"సరె, బాగానే వుంది! నే నియ్యనంటూ వుంటే మీ రెలా పుచ్చుకుంటారు?"

"అదో పెద్ద బ్రహ్మాండమా! ఇదుగో నీవు ఇవ్వనంటున్నా నేను పుచ్చుకొంటున్న దేమిటో చూశావా—ముద్దు!"

౧౯-౨౦